'మన్ కీ బాత్'లో బీజేపీ నేతలు



మేడ్చల్‌రూరల్: దేశంలోని ప్రజలను ఆధ్యాత్మిక, సంస్కృతిక, అభివృద్ధి పథంలో నిలిపేందుకు 'మన్ కీ బాత్' ఉపయోగపడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మాజీ కౌన్సిలర్, బీజేపీ నేతలు హంసరాణికృష్ణగౌడ్ నివాసంలో ఆదివారం బీజేపీ నేతలతో కలిసి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్, నాయకులు కృష్ణ, అర్జున్‌బాబు, మల్లేష్‌గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భద్రారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లారెడ్డి హెల్త్‌సిటీ ఛైర్మన్ చామకూర భద్రారెడ్డి హాజరై ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, నగేశ్ గుప్తా, పోచయ్యముదిరాజ్, బాబుచారి, లక్ష్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు రవిముదిరాజ్, మణిదీప్, సిరాజ్, భక్తులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న మోక్షదృతి

ఘట్‌కేసర్: కూచిపూడి నాట్య కళాకారిణి మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోక్షదృతి నాట్య ప్రపూర్ణ అవార్డును సాధించింది. నగరంలోని భారత్ వికాస్ పరిషత్ హాల్‌లో సూర్యచంద్ర కల్చరల్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కూచిపూడి నాట్య ప్రదర్శన పోటీలో ఉత్తమ ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నాట్య ప్రపూర్ణ అవార్డుకు ఎంపికైంది. సంస్థ అధ్యక్షుడు మోహనచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై అవార్డును అందజేశారు. రమణారెడ్డి, శ్రీనివాసశర్మ, శంకర్, నాట్య కళాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. 11కేవీ దూలపల్లి, కండ్లకోయ ఫీడర్ల పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పట్టు తప్పితే ప్రమాదం !

మేడ్చల్, మల్కాజిగిరిలో జిల్లాలో ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ వరకు అధికంగా కళాశాలలు ఉండటం.. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కళాశాలకు చేరాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటికి వెళ్లాలంటే ప్రతి రోజూ వారికి బస్సులతో కుస్తీలు తప్పడం లేదు.

– మేడ్చల్

- విద్యార్థుల ప్రాణాలకే ముప్పు
- కళాశాలకు వెళ్లేందుకు తప్పని పాట్లు
- అరకొరగా ఆర్టీసీ బస్సులు



మేడ్చల్ బస్టాండ్‌లో బస్సు కోసం ఎగబడుతున్న మహిళలు, విద్యార్థులు

అధికంగా కళాశాలలు..

బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ చదువుకునేందుకు మేడ్చల్ రూట్లో అధికంగా విద్యాసంస్థలు ఉన్నాయి. కొంపల్లి, మైసమ్మగూడ, మేడ్చల్, సుచిత్ర, జీడిమెట్ల, కండ్లకోయ, కిష్టాపూర్ తదితర ప్రాంతాల్లో అధికంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు.

☛ కొంపల్లి ప్రాంతంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, కండ్లకోయ, మైసమ్మగూడలలో ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సుల కళాశాలలు ఉన్నాయి.

☛ మేడ్చల్‌లో చిన్న స్కూల్ నుంచి ఇంటర్నేషనల్ స్కూల్ వరకు దాదాపు నిత్యం మేడ్చల్‌కు 60 వేల మంది విద్యార్థులు వివిధ దశల్లో చదువులు చదువుతున్నారు. స్కూల్ పిల్లలు స్కూల్ బస్సులు, లేదా తల్లిదండ్రులు ఏర్పాటు చేసే వాహనాల్లో స్కూళ్లకు వెళ్తుండగా ఇంటర్ నుంచి ఆపై చదువులు చదివే వారు అధికంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు చేస్తూ.. విద్యాసంస్థలకు వెళ్తున్నారు.

అంతా మేడ్చల్‌లోనే...

కండ్లకోయ, మైసమ్మగూడలో చదివే విద్యార్థులు అధికంగా మేడ్చల్‌లోనే నివాసం ఉంటున్నారు. ఇంటర్మీడియట్ స్థాయి నుంచి పైస్థాయిలో చదివే విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల వారు ఎక్కువగా ఉన్నారు. మైసమ్మగూడలో హాస్టల్ ఫీజులు అధికంగా ఉండటంతో ఎక్కువ మంది మేడ్చల్‌లోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ.. కళాశాలకు వెళ్తున్నారు.

☛ మేడ్చల్‌లో వినాయక్‌నగర్, ఉమానగర్, ఆర్టీసీ కాలనీలలో అధికంగా హాస్టళ్లు ఉన్నాయి. బస్టాండ్‌కు ఈ కాలనీలు సమీపంలో ఉండటంతో ఇక్కడ ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.



ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై విద్యార్థులు

కాలు మోపలేనంతగా రద్దీ..

మేడ్చల్ నుంచి కళాశాలల సమయాల్లో కండ్లకోయ, మైసమ్మగూడ, కొంపల్లిలకు వెళ్లాలంటే అరగంట లోపు ప్రయాణం. దీనికోసం విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉదయం 9.30 కళాశాల ఉంటే విద్యార్థులు మేడ్చల్ నుంచి 8 గంటలకే బయలుదేరాల్సి ఉంటుంది. కాలు మోపలేనంతగా బస్సుల్లో రద్దీ ఉండటం, ఫుట్ బోర్డు ప్రయాణాలు తప్పడం లేదు.

ఆటోలకు వెళ్తే ఆర్థికభారం..

నిత్యం బస్సుల్లో వెళ్తూ.. రద్దీ ఉండటంతో ఆటోలో వెళ్దామంటే ఆర్థికభారం, ఖాళీ బస్సుల్లో వెళ్దామంటే ఆలస్యమవడంతో గైర్హాజరు పడుతోంది. మేడ్చల్, కండ్లకోయ, కొంపల్లి బస్టాప్‌ల వద్ద ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వందలమంది విద్యార్థులు ఉంటున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఓ వైపు విద్యార్థులు.. మరో వైపు కార్మికులు..

మేడ్చల్, గుండ్లపోచంపల్లి ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలు కావడం వాటికి తోడు అధిక సంఖ్యలో విద్యా సంస్థలు ఉండటంతో ఆర్టీసీకి బస్సులు నడపడం కత్తిమీద సాములా మారింది. మరో వైపు మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళా కార్మికులు ప్రైవేటు వాహనాల ప్రయాణానికి స్వస్తి పలికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుండటంతో రద్దీ ఎక్కువగా మారింది.

☛ కంపెనీల సమయం, విద్యార్థుల సమయం దాదాపు ఒకేసారి ఉండటం, విధులకు వెళ్లే కార్మికులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. దీంతో విద్యార్థులతో పాటు మహిళా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉచిత బస్సుతో పెరిగిన రద్దీ..

ఓ వైపు బాలికలు, మహిళలకు ప్రభుత్వం మహలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, కార్మికులు అరగంట సేపు ప్రయాణానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న వజీద్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ పలు దేశాల్లో విద్యనభ్యసించి ప్రపంచ మేధావిగా గుర్తించబడ్డారని కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు వజీద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ అంటరానితనం, పేదరిక నిర్మూలనకు జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. పేద, ధనిక, కుల, మత బేధం లేకుండా అందరూ సమానం అనే భావనతో అందరికీ ఓటుహక్కు కల్పించారన్నారు. ఫరూక్, సత్యం, దస్తగిరి, జుబేర్, నబీ, గణేష్‌గౌడ్, కృష్ణంరాజు, విష్ణు, అఖిల్, రోహిత్, శివకృష్ణ, కేశవ్, లలిత్ పాల్గొన్నారు.

రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో గోదాసమేత మన్నారు రంగనాయకస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం నిత్యనిధి, అశ్వవాహన సేవ, గజవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. సోమవారం గోదాదేవి జన్మోత్సవం, తిరునక్షత్రం అభిషేకం, గోదారంగనాయకస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



దుర్గా ప్రసాద్

కుషాయిగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయిపురికాలనీ, సైనిక్‌పురిలో నివాసం ఉండే రేణుకుంట దుర్గాప్రసాద్ కాచిగూడలో 'ఆర్డీ ప్రొ ఈవెంట్స్' పేరుతో ఈవెంట్ నిర్వాహకుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 25న షాపునకు వెళ్తున్నానని, ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు సెల్‌ఫోన్ ట్రాక్ చేయగా.. హైటెక్ సిటీ దుర్గం చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లి చూడగా కనిపించలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి సోదరుడు సాయినరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ నూతన కార్యవర్గం

మేడ్చల్: పట్టణంలోని ఉమానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని కాలనీవాసులు ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మినీందర్, కోశాధికారిగా పాండురంగం, ఉపాధ్యక్షులుగా వెంకటేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, చంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, 6 మంది గౌరవ అధ్యక్షులు, ముగ్గురు సలహాదారులు, 8 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



టీపీఎస్ కాలనీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల సహకారంతో ముందుకెళ్లడం జరుగుతుందని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని టీపీఎస్ కృష్ణానగర్, హెవెన్‌డాన్ కాలనీ అసోసియేషన్స్ పిలుపు మేరకు కాలనీల్లో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపల్ నుంచి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కిరణ్‌జ్యోతిప్రవీణ్, పర్వత్‌రెడ్డి, చీర శేఖర్, టీపీఎస్ కాలనీ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, హెవెన్‌డాన్ కాలనీ అధ్యక్షులు బండారి రమేష్, ఈరయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి కలాంకు ఘన నివాళి



అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని అవుషాపూర్‌లోని అబ్దుల్ కలాం పార్కులో నిర్వహించారు. ఆదివారం మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, సదానంద్‌రెడ్డి, సాయిలు, మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లో న్యూ కాలనీ యూత్ ఆధ్వర్యంలో జీవీకే గ్రీన్ హెల్త్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారుగా 72 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింగరావు, ఆర్గనైజర్ రూప్ కిరణ్ , న్యూ కాలనీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన దళిత జన సమితి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మల్లాపూర్: తెలంగాణ ఉద్యమం నాటి నుంచి ప్రజా ఉద్యమాలు చేస్తూ.. వారి సమస్యలపై పోరాటాలు చేస్తున్న తమను గుర్తించి న్యాయం చేయాలని ఆదివారం దళిత జన సమితి ప్రతినిధులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజా ఉద్యమాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతూ.. సొంత గూడు లేని దుస్థితిలో ఉన్నామని మంత్రికి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, తమ సొంతింటి కలను సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, ఎదునూరి సంపత్, సయ్యద్ మాజిద్, కుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌కు దారి

ఉప్పల్: అత్యవసర స్థితిలో పేషెంట్‌తో ఉన్న అంబులెన్స్ బోడుప్పల్ నుంచి వస్తూ.. ఉప్పల్ నల్ల చెరువు కట్టపై ట్రాఫిక్‌లో చిక్కుకుంది. చాలాసేపు వేచి ఉన్నా.. వెళ్లేందుకు దారిలేకపోవడంతో అంబులెన్స్ వెనకాలే ఉన్న రాగిడి లక్ష్మారెడ్డి వెంటనే తన కారులోంచి దిగి అనుచరుల సాయంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. బాధ్యతను గుర్తుంచుకున్న రాగిడిపై ప్రశంసల జల్లు కురిపించారు.

నేడు రహదారి పనులు ప్రారంభం

మౌలాలి : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మారుతీనగర్ ప్రధాన రహదారి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభంకానున్నట్లు మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. గుంతలు పడి అధ్వాన్నంగా మారిన మారుతీనగర్ ప్రధాన రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళన, ధర్నాలు చేసినట్లు ఆమె వివరించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించినట్లు స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎస్సై వెంకన్న తదితరులు

కుషాయిగూడ: భాగ్యనగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జై జవాన్ కాలనీలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత రామానుజం, కుషాయిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్మల వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరై పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్‌తరాలను దృష్టిలో ఉంచుకుని సామాజిక స్పృహతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు వడ్లోజు జ్యోతిర్మయచారి, మహంకాళి నర్సింహ్మాచారి, విష్ణుసాయిప్రసాద్, యాదగిరి, నారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ..



అన్నోజిగూడలో చిన్నారులు

బోనం.. వైభవం !

ఘనంగా శ్రావణ బోనాల జాతర



లాలోనిగూడలో బోనాలతో మహిళలు

జవహర్‌నగర్: అంబేడ్కర్‌నగర్‌లో బోనాల జాతర వైభవంగా జరిగింది. ఆదివారం అంబేడ్కర్‌నగర్, జయశంకర్‌కాలనీ ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున బోనం సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, గాజులు, వస్త్రాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాడవాడన డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, ఒగ్గుడోలు ఆనందోత్సవాలతో ర్యాలీగా వెళ్లి, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తల్లులకు బోనం సమర్పించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నేతలు రాజుయాదవ్, అనిల్‌ముదిరాజ్, అశోక్‌గుప్తా తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మర్పల్లిగూడ, కొండాపూర్‌లో అమ్మవారి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ బోనంతో మహిళలు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించారు.

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో బోనాల జాతర వైభవంగా జరిగింది. అన్నోజిగూడలోని శ్రీచైతన్య స్కూల్‌లో చిన్నారులు బోనాల జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పోతరాజుల వేషధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి చల్లగా చూడాలని వేడుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, ఇన్‌చార్జి లావణ్య, సిద్ధిక్ష ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ ఛైర్మన్ భద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కలెక్షన్లపై ప్రత్యేక నజర్ !

- కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్న ఆర్టీసీ
- కొత్త ఆలోచనలతో సంస్థ ప్రయోగాలు
- సత్ఫలితాలు ఇస్తుండటంతో ముందుకు



ప్రత్యేక బస్సుల వద్ద..

మేడ్చల్: ఆర్టీసీకి మహలక్ష్మి పథకంతో కలెక్షన్లు తగ్గడంతో సంస్థ యాజమాన్యం కలెక్షన్ల పెంపునకు అనేక కొత్త మార్గాలు, ఆలోచనలు చేస్తుండంతో సంస్థ ప్రయోగాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రధానంగా ఆర్టీసీ స్థానిక డిపో నుంచి ప్రఖ్యాత ఆలయాలకు నూతన రూట్లను రూపొందిస్తూ.. సెలవు రోజుల్లో ప్రత్యేక బస్సులు నడిపిస్తుండటంతో ప్రజల అవసరాలు తీరుతున్నాయి.

ప్రత్యేక ప్యాకేజీల్లో బస్సులు..

కలెక్షన్ల వేటలో ఆర్టీసీ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. గతంలో ఆర్టీసీ బస్సును తీసుకోవాలంటే ముందుగా బుక్ చేసుకుని డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. పెళ్లిళ్లు, తీర్థయాత్రలకు వెళ్లే వారు బృందాలుగా ఏర్పడి ఒకరు బాధ్యత తీసుకుని బస్సును బుక్ చేసుకునే వారు. రేట్లు ప్రైవేటు కంటే అధికంగా ఉండటంతో పెద్దగా ఆదరణ స్పెషల్ బస్సులకు కురవైంది. దీంతో అధికారులు నూతన ఆలోచనలు చేసి పరిస్థితులకు తగినట్లుగా రూట్లను తయారు చేస్తూ.. బస్సును ఎక్కడకైనా నడిపిస్తున్నారు. ప్రాంతాల పరిమితి లేకుండా ఎక్కడికైనా బస్సులు నడిపిస్తూ కలెక్షన్లను తెచ్చుకునే పనిలో పడ్డారు.

మేడ్చల్ టు స్వర్ణగిరి..

మేడ్చల్ నుండి భువనగిరిలో ఉన్న స్వర్ణగిరి రూట్ తయారు చేసి ప్రతి అదివారం ప్రత్యేక బస్సును నడిపిస్తున్నారు. మేడ్చల్ శివార్లలో ఉన్న బండమైలారం దక్షిణ బద్రీనాథ్, కీసర సమీపంలో ఉన్న చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, వర్గల్ సరస్వతి ఆలయం , కొమరవెల్లి మల్లన్న ఆలయం, భువనగిరి స్వర్ణగిరి ఆలయాలను కలుపుతూ బస్సులు నడుపుతున్నారు. ఇందులో ప్రయాణం కోసం పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.300 టికెట్ ధర నిర్ణయించారు



వర్గల్ సరస్వతి ఆలయం వద్ద ఉపాధ్యాయులతో విద్యార్థినులు

మేడ్చల్, కాళేశ్వరం, వరంగల్..

మేడ్చల్, కాళేశ్వరం, రామప్పగుడి, వరంగల్ భద్రకాళి, వేయిస్తంభాల గుడి తదితర ఆలయాలను కలిపి ఓ రూట్ తయారు చేసి అధికంగా బుకింగ్‌లు ఉంటే స్పెషల్ బస్సులు నడిపిస్తున్నారు. ఇందులో ప్రయాణానికి పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.600 టికెట్ ధర నిర్ణయించారు.

పిల్లలకు ఉపయోగకరం..

టికెట్ ధర ప్రత్యేక బస్సులో నిర్ణయించడంతో పాఠశాలలకు ఈ టూర్ ప్యాకేజీలు ఉపయోగపడుతున్నాయి. స్కూల్ బస్సులు లేని యాజమాన్యాలు విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతున్నాయి. మేడ్చల్ ఆర్టీసీ అధికారులు ఓ రూట్ తయారు చేసి బస్సులను నడుపుతూ.. దైవ దర్శనాలు చేయించడంతో బస్సులను అందుబాటులో ఉంచుతూ.. వచ్చే కలెక్షన్‌తో సంస్థకు ఆదాయం తీసుకొస్తున్నారు.